క్లుప్తంగా

అన్ని సౌకర్యాలు కల్పించండి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ రజిత



ఎల్లమ్మ చెరువు కట్టపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న రజిత

హుస్నాబాద్: బతుకమ్మ ఆడే ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని చైర్ పర్సన్ ఆకుల రజిత.. అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట, ఆరపల్లె చెరువు కట్టపై నిర్వహించనున్న బతుకమ్మ పండుగ ఏర్పాట్లను సోమవారం కమిషనర్ మల్లికార్జున్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బతుకమ్మ ఆడే ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలన్నారు. లైటింగ్ సిస్టమ్, ఇతరేత్ర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఆయిలేని అనిత, కౌన్సిలర్లు పున్న లావణ్య సది, మ్యాదరబోయిన శ్రీనివాస్, వేణు యాదవ్, ఏఈ పృథ్వీరాజ్‌లు ఉన్నారు.

వృత్తి,విద్యా కోర్సులు నైపుణ్యానికి దోహదం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

దుబ్బాకటౌన్: విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడానికి వృత్తి, విద్యా కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని మిరుదొడ్డి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని అన్నారు. దసరా సెలవుల్లో భాగంగా విద్యార్థులు పట్టణంలోని లహరి కంప్యూటర్ మల్టీమీడియా సెంటర్లో వృత్తిపై శిక్షణ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు సెలవుల్లో సమయం వృథా చేయకుండా సమగ్ర శిక్షణ ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలు ఎంతగానో మెరుగవుతాయన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఉపాధ్యాయులు నీరజ, నాగరాజు తదితరులు ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 24 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి, రూ.44,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను మునిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాండవుల చెరువు వద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటు, శానిటేషన్ తదితర పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకొనేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. అనంతరం డంపింగ్ యార్డులోని డీఆర్‌సీసీ సెంటర్‌లో పొడి చెత్త వేరు చేసే విధానాన్ని, కంపోస్టు షెడ్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : సీఐ శ్రీను



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సీఐ ఎల్.శ్రీను అన్నారు. సోమవారం మండలంలోని కడవేర్గులో కొమ్మూరి యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువత, విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు వినీత్, రమేశ్, లింగారెడ్డి, విజయ్, నరేశ్, నౌషద్, సురేందర్ పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి నమోస్తుతే

దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయాలు, మండపాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు దర్శించుకొని మమ్ములను సల్లంగా చూడమ్మ అంటూ వేడుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఆపై మొక్కులు చెల్లించారు.



నంగునూరు(సిద్దిపేట): గట్లమల్యాలలో ..



చేర్యాల: ఆకునూరు భవానీ రుద్రేశ్వరాలయంలో కుంకుమపూజ చేస్తున్న మహిళలు



చిన్నకోడూరు(సిద్దిపేట): మల్లారంలో ..



కొండపాక: తిమ్మారెడ్డిపల్లిలో మహాచండీగా దర్శనమిచ్చిన దుర్గామాత



గజ్వేల్ మండలం రిమ్మనగూడలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



చంద్లాపూర్ శివారులో రోడ్డును కమ్మేసిన పిచ్చి మొక్కలు

జరపైలం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ నుంచి మాచాపూర్ వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు కమ్మేశాయి. దీంతో వాహనదారులు నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇరుకు కావడంతో ఢీ కొట్టుకొని గాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను కత్తిరించి వేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ఆర్ఎస్ఎస్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ వలంటీర్లు

హుస్నాబాద్‌రూరల్: విజయదశమి శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్ఎస్ఎస్ వలంటీర్లు కవాతు నిర్వహించారు. 1924లో ప్రారంభమైన విజయ దశమి ఉత్సవాలు వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నాయని సంఘం నాయకులు గందె చంద్రమౌళి అన్నారు. పర్యావరణ పరిరక్షణ, అంటరానితనం నిర్మూలన, కుటుంబ ఐక్యతకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి సత్యనారాయణ చారి, వీరారెడ్డి, వలువోజు రాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకు మంచి పేరు తీసుకురండి



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

విద్యార్థులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: సిద్దిపేటకు మంచి పేరు తీసుకురావాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఐఐటీ, నీట్, సీట్లు సాధించిన సుమారు 200 మంది విద్యార్థులను సోమవారం తన క్యాంపు ఆఫీస్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కోచింగ్ కేంద్రాలకు దీటుగా సిద్దిపేటలో కెరీర్ గైడెన్స్ సెంటర్ సత్ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ పాల్గొన్నారు.

ప్రత్యేకపూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట), గజ్వేల్, కొండపాక(గజ్వేల్), చిన్నకోడూరు(సిద్దిపేట): దుర్గామాత దర్శన భాగ్యం దొరకడం అదృష్టమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. మండలంలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గజ్వేల్‌లోని.. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో సూర్యవంశ ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రోత్సవాల్లోను పాల్గొన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లోను అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి దయతో జిల్లావాసులకు శుభం కలగాలని, ప్రతి ఒక్కరికీ అన్ని విధాలా మంచి జరగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. చిన్నకోడూరులోను అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు

- రూ.1.17 లక్షలు, బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం
- రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి



నిందితుడిని చూపుతున్న రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు

ములుగు(గజ్వేల్): పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడు పోలీసులకు చిక్కాడు. అతని నుంచి నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వివరాలను రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ములుగు మండలం బహిలంపూర్ ఆర్అండ్ఆర్ కాలనీ, వాగునూతి గ్రామాల్లో ఇటీవల తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దొంగతనాలకు సంబంధించి అప్పట్లోనే ములుగు పోలీసులు కేసులు నమోదు చేశారు. సోమవారం ఉదయం ఎస్ఐ విజయ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి రాజీవ్ రహదారిపై వంటిమామిడి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పెద్దుల కనుకయ్య అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని విచారించగా బహిలంపూర్, వాగునూతి గ్రామాల్లో తానే దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడని పేర్కొన్నారు. నిందితుడి నుంచి రూ. 1.17 లక్షలు, 2 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. నిందితుడి రిమాండ్‌కు తరలించామన్నారు.

'పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఉంటా'



ఓటరు నమోదు ఫారం విడుదల చేస్తున్న శేఖర్ తదితరులు

హుస్నాబాద్‌రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఉంటానని టస్మా రాష్ట్ర ముఖ్యసలహాదారు యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. సోమవారం హుస్నాబాద్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 2,500 ప్రైవేటు పాఠశాలలు ఉంటాయన్నారు. ఆయా పాఠశాలలో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ పట్టభద్రులతో పాటు ప్రైవేటు పాఠశాలల పూర్వ విద్యార్థులు అందరూ సహకారం అందిస్తారన్నారు. గత ఎన్నికల్లో ట్రస్మా సంక్షేమం కోసమే పోటీ నుంచి వైదొలిగానన్నారు. పట్టభద్రుల సంక్షేమం కోసం ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. తొలుత పట్టభద్రుల ఓటరు నమోదు ఫారం విడుదల చేశారు. ట్రస్మా కరీంనగర్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు రూ. 22.72 లక్షలు



రశీదు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: సకాలంలో పన్నులు చెల్లించి, ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ఆస్తి పన్ను వసూలు ప్రక్రియను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానిక పత్తి మార్కెట్‌కు సంబంధించిన ఆస్తి పన్ను రూ 11.46 లక్షలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు సంబంధించిన పన్ను రూ 11.14 లక్షలు, పశువుల మార్కెట్‌కు సంబంధించి పన్ను రూ.11,196 వేలు మొత్తంగా రూ.22,72 లక్షలను వసూలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాల 2005–06 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. అందరూ ఒక్క చోట చేరి గడిచిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): నవోదయలో విద్యార్థుల 'బ్యాగ్‌లెస్ డే' ఉత్సాహంగా ఉల్లాసంగా కొనసాగుతోంది. నాలుగో రోజైన సోమవారం బాలబాలికలు ఆటలు, నృత్యాలు ఇతరేత్ర కార్యక్రమాల చేపట్టి రోజంతా హుషారుగా గడిపారు. పదో తరగతి ఉపవాచక రచయిత, ప్రముఖ కవి, పల్లెర్ల రామ్మోహన్‌రావు రామాయణ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. పురణ ఇతిహాసాల్లో మంచిని గ్రహించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తాను రచించిన పలు పుస్తకాలను పదోతరగతి విద్యార్థులకు అందజేశారు. తెలుగు ఉపన్యాసకులు శంకరమంచి శ్యాంప్రసాద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజేందర్ అతిథులను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ నిందితుడిని శిక్షించాలి



సిద్దిపేటకమాన్: ఇటీవల కొమురవెల్లి మండలంలోని ఒక గ్రామంలో మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సంజయ్ కుమార్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దిశా చట్టాన్ని సమన్యాయంగా అన్ని కులాల వారికి అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో స్త్రీల భద్రత కరువైందన్నారు. ఈ ఘటనలోని నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తొలుత పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమేశ్, శ్రీనివాస్, నరేశ్, గణేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ అంతరాయం



సిద్దిపేటరూరల్: 11 కేవీ వైర్ల మరమ్మతులో భాగంగా మండల పరిధిలోని ఇర్కోడ్ గ్రామంలో కరెంట్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంతో పాటుగా అక్కడి పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలివేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ

బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లావ్యాప్తంగా బతుకమ్మలను పేర్చి ఒక చోటకు చేర్చి మహిళలు ఆడారు. పూలనే దైవంగా పూజించే ప్రత్యేక పండుగ బతుకమ్మ అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం చెరువుల్లో, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో బతుకమ్మ ఆడుతున్న మహిళా వైద్యులు, సిబ్బంది



సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ ఆధ్వర్యంలో..



సిద్దిపేటజోన్: పోలీసు కమిషనరేట్‌లో..



ములుగు(గజ్వేల్): బతుకమ్మ సంబరాల్లో మహిళలు